భద్రత పేరిట అడ్డగోడలు

- రైల్వే అధికారుల తీరుపై విమర్శలు
- రాకపోకలకు తప్పని తిప్పలు
- చుట్టూ తిరిగి వెళ్లాల్సిన వైనం


శ్రీనగర్ కాలనీ రెండో రోడ్డుకు అడ్డుగా నిర్మించిన గోడ


రైల్వేకాలనీ నుంచి శ్రీనగర్ కాలనీవైపు రోడ్డుకు అడ్డుగా నిర్మించిన గోడ

మధురానగర్(విజయవాడసెంట్రల్): రైల్వే కాలనీకి వచ్చే దారులన్నీ మూసేసి అడ్డుగోడలు కట్టడంతో పరిసర కాలనీల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఈ సమస్యపై ప్రజలు, ప్రజాప్రతినిధులు వినతిపత్రాలు ఇచ్చినా రైల్వే అధికారుల్లో కనీస స్పందన కరువైంది. ఫలితంగా దగ్గర దారులను వదిలేసి చుట్టూ తిరిగిరావాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది.

విషయం ఇదీ..

31, 28వ డివిజన్‌లలో రైల్వే కాలనీ ఉంది. ఈ కాలనీకి చుట్టుపక్కల కాలనీ వాసులు వివిధ ప్రాంతాలకు రైల్వే కాలనీలో ఉన్న రోడ్ల ద్వారా ఇతర ప్రాంతాలకు వెళుతుంటారు. ఇది దగ్గర మార్గం, పైగా మెయిన్ రోడ్లలో ట్రాఫిక్ సమస్యను తప్పుకునేందుకు ఈ మార్గాలను అనుసరిస్తుంటారు. నగరంలోని పలు డివిజన్‌లకు చెందిన వాహన చోదకులు శ్రీనగర్ కాలనీ రెండో వార్డు తదితర ప్రాంతాల నుంచి రైల్వేకాలనీ మీదుగా నగరంలోకి రాకపోకలు సాగిస్తున్నారు.

హత్యకేసు సాకుగా..

అయితే రైల్వే కాలనీలో జరిగిన హత్య ఉదంతాన్ని రైల్వే అధికారులు సాకుగా తీసుకుని రైల్వే కాలనీ మీదుగా రాకపోకలు సాగించే రోడ్లను మూసివేశారు. కాలనీలోకి వచ్చే మూడు వైపులా రోడ్లకు అడ్డుగోడలు నిర్మించారు. దీంతో రాకపోకలకు వాహనచోదకులు పాదచారులు నానాయాతన పడుతున్నారు. రైల్వే కాలనీవాసులకు మాత్రం మెయిన్ రోడ్డుకు వెళ్లే రెండు రోడ్లను వదిలేశారు.

ప్రజాప్రతినిధులకు వినతి..

రోడ్లకు అడ్డంగా నిర్మించిన గోడలను తొలగించి రాకపోకలకు వీలు కల్పించాలని అప్పటి ఎంపీ కేశినేని నాని, ఎమ్మెల్యే మల్లాది విష్ణు, కార్పొరేటర్‌లు పెనుమత్స శిరీష సత్యం, వీరమాచనేని లలిత, రైల్వే డీఆర్ఎం, ఇతర అధికారులను కలిసి వినతి పత్రం అందజేశారు. అయితే అధికారులు పరిశీలిస్తామంటూ హామీ ఇచ్చారు. కానీ ఇంతవరకు ఏ ఒక్క అధికారి ఇటువైపు కన్నెత్తి చూసిన దాఖలాలు లేవు. శ్రీనగర్ కాలనీ రెసిడెన్సియల్ వెల్ఫేర్ అసోసియేషన్ నేతలు అధికారులకు పలుమార్లు వినతి పత్రం అందజేశారు. ఇటీవల కార్పొరేటర్ వీరమాచనేని లలితతో కలిసి ఎంపీ కేశినేని శివనాథ్‌కు కూడా వినతి పత్రం అందజేశారు. దీనిపై స్పందించిన ఎంపీ పరిశీలించి సాధ్యమైనంత త్వరలో రాకపోకలు పునరుద్ధరిస్తామని హామీ ఇచ్చారు.

గోడలు నిర్మించడంతో..

అడ్డుగోడలు కట్టడంతో నిత్యం రద్దీగా వేలాది మంది రాకపోకలు సాగించే శ్రీనగర్‌కాలనీ, రైల్వే కాలనీ రోడ్లు నిర్మానుష్యంగా మారాయి. గతంలో పాయకాపురం అజిత్ సింగ్‌నగర్ తదితర ప్రాంత వాసులు భగత్‌సింగ్ రోడ్డు రద్దీగా ఉండటంతో శ్రీనగర్ కాలనీ మీదుగా నగరంలోకి రాకపోకలు సాగించేవారు. ప్రస్తుతం ఈ మార్గం మూసివేయటంతో భగత్‌సింగ్ రోడ్డులో రద్దీ పెరిగింది.

వ్యాపారులు విలవిల..

శ్రీనగర్‌కాలనీ రైల్వేకాలనీ మీదుగా రాకపోకలు సాగించేటప్పుడు ఈ ప్రాంతంలో వ్యాపారాలు జోరుగా సాగేవి. ఇప్పుడు రాకపోకలు తగ్గి పోవటంతో వ్యాపారాలు మందగించాయి. కనీసం అద్దెలు కూడా రాని పరిస్థితి ఏర్పడింది.

చుట్టూతిరగాల్సిందే..

శ్రీనగర్ కాలనీ నుంచి బీఆర్‌టీఎస్ రోడ్డుకు వచ్చేందుకు కేవలం అర కిలోమీటరు లోపు ప్రయాణం చేస్తే సరిపోయేది. రైల్వే అధికారుల తీరు వల్ల ఇప్పుడు రెండు కి.మీ తిరిగి ప్రయాణం చేయాల్సి వస్తోంది. ఇక్కడ రోడ్డు మూసివేయటంతో భగత్‌సింగ్ రోడ్డులో ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడినప్పుడు ప్రత్యామ్నాయ మార్గం లేకుండా పోయింది.

యాతన పడుతున్నాం..



రైల్వే అధికారుల తీరు వల్ల కొద్దిపాటి దూరం వెళ్లటానికి సైతం చుట్టూతిరిగి వెళ్లాల్సి వస్తోంది. గతంలో నిమిషాల వ్యవధిలోనే బీఆర్టీఎస్ రోడ్డుకు చేరుకునే వాళ్లం. ఇపుడు భగత్‌సింగ్ రోడ్డులో ట్రాఫిక్ పెరిగిపోవటంతో రాకపోకలకు నానాయాతన పడుతున్నాం.

– ఏపుగంటి సాయికృష్ణ, శ్రీనగర్ కాలనీ

స్కూలు పిల్లలకూ ఇబ్బందే..



మా ప్రాంతానికి చెందిన ఎంతో మంది పిల్లలు బీఆర్‌టీఎస్ రోడ్డులోని ఎస్‌టీవీఆర్ నగరపాలక సంస్థ పాఠశాల తదితర ప్రాంతాలకు వెళుతుంటారు. గతంలో ఎటువంటి ట్రాఫిక్ లేకుండా సేఫ్‌గా రైల్వే కాలనీ మీదుగా గమ్యస్థానాలకు చేరుకునే వాళ్లం. ఇప్పుడు ట్రాఫిక్ వల్ల పిల్లలతో బిక్కుబిక్కుమంటూ రాకపోకలు సాగిస్తున్నాం.

–ఎస్.దుర్గ, టీచర్స్ కాలనీ

వ్యాపారం తగ్గింది..



ఎంతో కాలంగా ఇక్కడ వ్యాపారం చేస్తున్నాను. ఇక్కడ రహదారి మూసివేసిన దగ్గర నుంచి వ్యాపారాలు లేక నానా అవస్థలు పడుతున్నాం. ఎప్పటికప్పుడు రాకపోకలు పునరుద్ధరిస్తారు.. వ్యాపారాలు పెరుగుతాయని ఆశగా ఎదురు చూస్తున్నాం. కనీసం అద్దెలు కూడా వచ్చే పరిస్థితి లేదు.

–ఎం.శివ, వ్యాపారి

క్లుప్తంగా

300 మందికి వైద్యపరీక్షలు

మధురానగర్(విజయవాడసెంట్రల్): ఉచిత వైద్య సేవలను సద్వినియోగం చేసుకుని ఆరోగ్యకర జీవనం సాగించాలని శ్రీ గురు విశ్వస్ఫూర్తి ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ, ట్రెజరర్ చొప్పరపు నారాయణ రావు అన్నారు. స్థానిక మధురానగర్ శ్రీగురువిశ్వస్ఫూర్తి ట్రస్ట్ తృతీయ వార్షికోత్సవం సందర్భంగా ట్రస్ట్ కార్యాలయంలో శనివారం ఉచిత వైద్య శిబిరం జరిగింది. అనంతరం సుమారు 300 మందికి ఉచితంగా వైద్యపరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి మందులు అందజేశారు. కార్యక్రమంలో కెంబూరి కృష్ణ, రజనీకాంత్ పాల్గొన్నారు.

ఎన్టీఆర్ సినీరంగ సేవలు వెలకట్టలేనివి



విజయవాడ కల్చరల్: సినీ నటుడు, దర్శకుడు, నిర్మాత ఎన్టీఆర్ సినీ రంగసేవలు వెలకట్టలేనివని డ్రీమ్ ఆడియో అధినేత చావా నరసింహారావు అన్నారు. డ్రీమ్ ఆడియో ఆధ్వర్యంలో గాంధీనగర్‌లోని కొత్తా పూర్ణానందం కళావేదికమీద ఎన్టీఆర్ సినీ వజ్రోత్సవం, సినీ సంగీత విభావరి, ఎన్టీఆర్ సేవా పురస్కార కార్యక్రమం నిర్వహించారు. సావిత్రి కళాపీఠం వ్యవస్థాపకురాలు పరుచూరి విజయలక్ష్మి మాట్లాడుతూ ఎన్టీఆర్‌కు భారతరత్న పురస్కారం కోసం రాష్ట్ర ప్రభుత్వం కృషి చేయాలని సూచించారు. రాజధాని అమరావతిలో ఎన్టీఆర్ పేరుతో క్రీడా స్టేడియం నిర్మించాలన్నారు. చావా నరసింహారావు ఎన్టీఆర్ సినీ జీవిత విశేషాలను వివరించారు. కే వెంకటేశ్వరెడ్డి, గాయకుడు ప్రిన్స్ సీహెచ్‌బాబు, డేవిడ్‌రాజు, ప్రభల శ్రీనివాస్, నారుమంచి నారాయణ పాల్గొన్నారు. పరుచూరి విజయలక్ష్మి కి ఎన్టీఆర్ సేవ పురస్కారం ప్రదానం చేశారు. గాయనీ గాయకులుతెలుగు హిందీ చిత్రగీతాలను ఆలపించారు.

క్రీడా ప్రాంగణాల అభివృద్ధికి కృషి

శాప్ చైర్మన్ రవినాయుడు



విజయవాడస్పోర్ట్స్: క్రీడా ప్రాంగణాలను అభివృద్ధి చేసేందుకు ఆంధ్రప్రదేశ్ క్రీడా ప్రాధికార సంస్థ(శాప్) కృషి చేస్తోందని శాప్ చైర్మన్ అనిమిని రవినాయుడు వెల్లడించారు. విజయవాడ నాల్గో డివిజన్‌లోని వెటర్నరీ కాలనీలో శిథిలావస్థకు చేరిన యూత్ హాస్టల్ భవనాన్ని ఆయన శనివారం పరిశీలించిన అనంతరం మాట్లాడారు. శిథిలావస్థకు చేరి అసాంఘిక కార్యాకలాపాలకు అడ్డగా మారి నిరుపయోగంగా ఉన్న ఈ భవనం పరిస్థితిని ఆంధ్రప్రదేశ్ ఒలింపిక్ అసోసియేషన్ కార్యదర్శి కె.పి.రావు తన దృష్టికి తీసుకొచ్చారని వెల్లడించారు. అసోసియేషన్ సభ్యులకు ఆమోదయోగ్యమైతే శాప్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్‌రావు, ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని) సహకారంతో క్రీడాప్రాంగణాన్ని అభివృద్ధి చేస్తామని స్పష్టం చేశారు. విద్యార్థులకు, యువతకు, క్రీడాకారులకు ఉపయోగకరంగా మల్టీపర్పస్ ఇండోర్ హాలు, స్పోర్ట్స్ రెసిడెన్సియల్ సెంటర్లను ఏర్పాటు చేస్తామన్నారు. చైర్మన్ వెంట డివిజన్ కార్పొరేటర్ జాస్తి సాంబశివరావు, కాలనీ ప్రెసిడెంట్ నల్లూరి సుబ్బారావు ఉన్నారు.

కిశోర వికాసంపై శిక్షణ



మధురానగర్(విజయవాడసెంట్రల్): దుర్గాపురం సీఐటీయూ కార్యాలయంలో శనివారం ఐసీడీఎస్ ఆధ్వర్యాన కిశోరి వికాసం మండల స్థాయి శిక్షకుల శిక్షణా కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఎంఈఓ వెంకటరత్నం మాట్లాడుతూ ఇక్కడ నేర్చుకున్న అంశాలను క్షేత్ర స్థాయిలో అమలు చేసేందుకు కృషి చేయాలని సూచించారు. కిశోర బాలికలు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని హెల్ప్‌లైన్ గురించి తెలుసుకోవాలని అన్నారు. కిశోర బాలికలలో ఆత్మస్థైర్యం పెంపొందించాలని చెప్పారు. సీడీపీఓ నాగమణి కిశోర బాలికలు తీసుకోవాల్సిన ఆహారం, యోగా, సెల్ఫ్ డిఫెన్స్ పద్ధతులను వివరించారు. సమన్వయంతో పని చేసి కిశోర బాలికలకు అవసరమైన సేవలు అందించాలని సూచించారు.సూపర్‌వైజర్లు వి. విజయ, వీ నాగమణి, అచ్యుతాంబ, ప్రశాంతి పాల్గొన్నారు.

ఆర్థిక ప్రగతికి మన్మోహన్ కృషి



విజయవాడ కల్చరల్: దేశాన్ని ప్రగతి పథంవైపు నడిపించిన దార్శనికుడు డాక్టర్ మన్మోహన్‌సింగ్ అని తెలుగు కళావాహిని అధ్యక్షుడు చింతకాయల చిట్టిబాబు అన్నారు. విజయవాడ సాంస్కృతిక, కళాసంస్థల ఆధ్వర్యంలో గాంధీనగర్‌లోని కొత్తా పూర్ణానందం కళావేదికమీద శనివారం మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్ సంస్మరణ సభను నిర్వహించారు. చిట్టిబాబు మాట్లాడుతూ దేశ ఆర్థిక ప్రగతి కోసం కృషి చేసిన వ్యక్తి అని అభివర్ణించారు. కార్యక్రమంలో వివిధ సంస్థల ప్రతినిధులు కే డేవిడ్‌రాజు, కోట వెంకటేశ్వరరెడ్డి, మండవ దామోదర శివ, ఆత్కూరి రామ్మోహన్, యల్లాప్రగడ శ్రీనివాసరావు, ఆర్‌వీ చలపతిరావు పాల్గొన్నారు. మన్మోహన్ మృతికి సంతాపం ప్రకటించారు.

విద్యారంగాన్ని ప్రైవేట్‌పరం చేస్తున్న ప్రభుత్వాలు

ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి అశోక్



మధురానగర్(విజయవాడసెంట్రల్): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విద్యారంగాన్ని కార్పొరేట్, ప్రైవేటు పరం చేసేందుకు ప్రయత్నాలు చేస్తున్నాయని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి ఎ.అశోక్ విమర్శించారు. ఎస్ఎఫ్ఐ ఎన్టీఆర్ జిల్లా మహాసభలలో భాగంగా ఎస్ఆర్ఆర్ అండ్ సీవీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శనివారం బహిరంగ సభ జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని లేని పక్షంలో భవిష్యత్తు పోరాటాలకి విద్యార్థి లోకం కదిలి వస్తారని ఆయన ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఎన్టీఆర్ జిల్లా కార్యదర్శి సీహెచ్ వెంకటేశ్వరరావు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం పెండింగ్ లో ఉన్న 5 వేల కోట్ల ఫీజు రీయింబర్స్ వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. విద్య శాఖ మంత్రి లోకేష్ గుడ్ న్యూస్ పేరుతో ట్వీట్లు పెట్టడం తప్ప ఈ విద్య సంవత్సరం ఒక్క రూపాయి కూడా ఫీజు రీయింబర్స్‌మెంట్ ఇవ్వలేదని విమర్శించారు. తొలుత చుట్టుగుంట బీఎస్ఎన్ఎల్ నుంచి ఎస్ఆర్ఆర్ ప్రభుత్వడిగ్రీ కళాశాల వరకు ర్యాలీ నిర్వహించారు. ఎస్ఎఫ్ఐ ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడు గోపి నాయక్, జిల్లా గరల్స్ కన్వీనర్ జాహిద, ప్రణీత, జిల్లా ఉపాధ్యక్షులు కుమారస్వామి, మాధవ్, విజయవాడ నగర నాయకులు ఓజేశ్వేన్, వాసు, ఇనోష్, హాసిని, షణ్ముఖ, ప్రసాద్, భార్గవ్, డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు పి.కృష్ణ, ఎస్ఎఫ్ఐ మాజీ నాయకులు ప్రవీణ్ వివిధ కళాశాల విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు

నగరాభివృద్ధే లక్ష్యంగా అడుగులు

- వీఎంసీ స్థాయీసంఘ సమావేశంలో మేయర్ భాగ్యలక్ష్మి
- వారం రోజుల పనికి 56 రోజులకు బిల్లు పెట్టడంపై మేయర్ ఆగ్రహం


వీఎంసీ స్థాయీసంఘం సమావేశంలో మాట్లాడుతున్న మేయర్ భాగ్యలక్ష్మి

పటమట(విజయవాడతూర్పు): విజయవాడ నగర పాలక సంస్థ పరిధిలోని అన్ని ప్రాంతాలను అభివృద్ధి చేయటానికి తాము ప్రణాళికాబద్ధంగా అడుగులు వేస్తున్నామని నగర మేయర్ రాయన భాగ్యలక్ష్మి తెలిపారు. వీఎంసీ ప్రధాన కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ రూంలో శనివారం స్థాయీసంఘం సమావేశం జరిగింది. సమావేశంలో మేయర్ మాట్లాడుతూ.. సవాళ్లను అధిగమించి నగరంలోని అన్ని డివిజన్లను అభివృద్ధి చేసేందుకు అడుగులు వేస్తున్నామన్నారు. విజయవాడ నగరాన్ని మెట్రో నగరాలకు ధీటుగా అభివృద్ధి చేశామని, మరింత అభివృద్ధి చేయటానికి చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. సమావేశంలో మొత్తం 28 అంశాలు అజెండాలో పొందుపర్చగా, అందులో ఆరు అంశాలను వాయిదా వేయగా, ఒక అంశాన్ని రికార్డు, ఒక అంశాన్ని ధ్రువీకరణ చేశారు. 20 అంశాలను ధ్రువీకరిస్తూ సభ్యులు తీర్మానం చేశారు.

ప్రధానాంశాలు..

- స్వచ్ఛ సర్వేక్షణ్ 2020కి కాంట్రాక్ట్ పద్ధతిపై నగరంలోని ఆయా డివిజన్లలో పారిశుద్ధ్య నిర్వహణకు కాంట్రాక్టు కార్మికులకు నియమించుకుని, పని చేయించేందుకు కాంట్రాక్టర్లు జి.ఉమా, వై.రమాదేవిలకు వీఎంసీ వర్క్ ఆర్డర్ ఇచ్చారు. ప్రజారోగ్య విభాగం నుంచి 56 రోజులకు, రోజుకు ఒక్కో కార్మికునికి రూ.400 చొప్పున మొత్తం రూ.33.60 లక్షలు బిల్లును వీఎంసీ జనరల్ ఫండ్స్ నుంచి చెల్లింపు చేయాలని ప్రజారోగ్య విభాగం నుంచి వచ్చిన ప్రతిపాదనపై మేయర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. వర్క్ ఆర్డర్ ఏడు రోజులకు మాత్రమే ఉంటే 56 రోజులకు బిల్లును ఎలా పెడతారని ప్రజారోగ్య విభాగం అధికారులను మందలించి తీర్మానాన్ని వాయిదా వేశారు.
- వీఎంసీ పరిధిలోని సర్కిల్–2 ఏరియాలోని గవర్నర్‌పేటలోని ఎన్టీఆర్ కమర్షియల్ కాంప్లెక్స్ నూతనంగా నిర్మించిన మొదటి అంతస్తులో ఖాళీగా ఉన్న ఎఫ్ఎఫ్ 66ను సీల్డ్ టెండర్‌లో రూ.5.90 లక్షలకు అధిక మొత్తంలో పాడుకున్న ముదునూని సునీల్ కుమార్‌కు టెండర్‌ను ఖరారు చేస్తూ సభ్యులు తీర్మానం చేశారు.

స్వపక్షానికీ వేధింపులే

టీడీపీ కార్పొరేటర్ రాజీనామా

సాక్షినెట్‌వర్క్, విజయవాడ: టీడీపీ నేతల వేధింపులు భరించలేక ఆపార్టీ కార్పొరేటర్ రాజీనామా చేయడం చర్చనీయాంశంగా మారింది. విజయవాడ సెంట్రల్ నియోజకవర్గంలోని టీడీపీ కార్పొరేటర్ శనివారం నగర మేయర్‌కు రాజీనామా లేఖ అందజేశారు. తన డివిజన్‌లో కార్పొరేషన్ చేపట్టే పనుల్లో సైతం ఎమ్మెల్యే జోక్యం పెరిగిపోయిందని, అలాంటప్పుడు తాను కార్పొరేటర్‌గా ఉండి ఉపయోగం ఏమిటని ఆవేదన వ్యక్తం చేస్తూ రాజీనామా చేసినట్లు తెలిసింది. కార్పొరేటర్‌గా ఉన్నా, డివిజన్‌లో చిన్న పనులను సైతం కార్పొరేషన్ సిబ్బంది ఎమ్మెల్యే చెపితేనే చేస్తున్నారని, గత ప్రభుత్వంలో ప్రతిపక్షంగా ఉండి కూడా వేధింపులకు గురికాలేదని మదన పడుతున్నట్లు సమాచారం. ప్రజలు తనను కార్పొరేటర్‌గా ఎన్నుకున్నా ఏమీ చేయకుండా చేస్తున్నప్పుడు పదవిలో ఉండి ఉపయోగం ఏమిటని రాజీనామాకు పాల్పడినట్లు తెలిసింది.


పెత్తనం అంతా ఎమ్మెల్యేలదే..

ఒక్క సెంట్రల్‌లోనే కాదు తూర్పు నియోజకవర్గంలోనూ అదే పరిస్థితి. తమ డివిజన్‌లో అభివృద్ధి పనులు కార్పొరేషన్‌లో కార్పొరేటర్లు మంజూరు చేయిస్తుండగా, ఇక్కడ ఎమ్మెల్యే తానే చేస్తున్నట్లు చెప్పుకుంటూ తమను డమ్మీలుగా చేస్తున్నారని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో చేసిన పనులను ఈ ప్రభుత్వంలో చేసినట్లుగా చిత్రీకరించేందుకు అధికారులపై ఒత్తిడి తెచ్చి మరలా ప్రారంభోత్సవాలు చేసిన సందర్భాలు ఉన్నాయి. ఏ డివిజన్‌లో అయినా తాను చెప్పిన పనులే చేయాలని చెప్పడంతో కూటమి కార్పొరేటర్‌లు తీవ్ర అసమ్మతికి గురవుతున్నారు.

జిల్లాలో ఇదే పరిస్థితి..

ఎన్టీఆర్ జిల్లాలోని గ్రామీణ ప్రాంతాల్లో సైతం సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, జెడ్పీటీసీలకు వేధింపులు తప్పడం లేదు. ఇలా ప్రతిపక్షం, అధికార పక్షం అనే తేడా లేకుండా పెత్తనం చెలాయిస్తూ వేధింపులకు పాల్పడుతున్నట్లు ఆరోపణలు వెల్లువెత్తుతునారు. తిరువూరు, మైలవరం, నందిగామల్లో కూడా కూటమి నేతల వేధింపులకు స్వపక్షానికి చెందిన కిందిస్థాయి నేతలు అసహనానికి గురవుతున్నారని సమాచారం.

వాలీబాల్ టోర్నీ పోస్టర్ ఆవిష్కరణ


టోర్నమెంట్ పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఎంపీ చిన్ని తదితరులు

విజయవాడస్పోర్ట్స్: జాతీయ క్రీడలు– 2027 రాష్ట్రంలో నిర్వహించబోతున్నామని, అందుకు తగిన ఏర్పాట్లు ఇప్పటి నుంచే చురుగ్గా సాగుతున్నాయని విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్(చిన్ని) వెల్లడించారు. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా(ఎసీజీఎఫ్ఐ) 68వ అండర్– 19 బాలికల జాతీయ వాలీబాల్ టోర్నమెంట్ పోస్టర్‌ను పీబీ సిద్ధార్థ కాలేజీలో ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్‌తో కలిసి ఎంపీ శనివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ జనవరి 6 నుంచి 10వ తేదీ వరకు పీబీ సిద్ధార్థ కాలేజీలో ఈ పోటీలు జరుగుతాయన్నారు. అమరావతిలో స్పోర్ట్స్ సిటీ, స్పోర్ట్స్ యూనివర్సిటీ ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేస్తున్నామని, దీని కోసం స్టేడియాల ఆధునికీకరణ పనులు మొదలు పెట్టినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఇంటర్మీడియెట్ విద్యాశాఖాధికారి సి.ఎస్.ఎస్.ఎన్.రెడ్డి, పీబీ సిద్ధార్థ డిగ్రీ కాలేజీ ప్రిన్సిపాల్ మేకా రమేష్, జూనియర్ కాలేజీ ప్రిన్సిపాల్ సీహెచ్.వెంకటేశ్వర్లు, ఫిజికల్ డైరెక్టర్ మార్కండేయులు, స్కూల్ గేమ్స్ రాష్ట్ర సంయుక్త కార్యదర్శులు రాజు, రాధాకృష్ణ, కార్పొరేటర్ చెన్నుపాటి ఉషారాణి, శాప్ మాజీ చైర్మన్ అంకమ్మ చౌదరి, ఎస్‌జీఎఫ్ ఉమ్మడి కృష్ణా జిల్లా అండర్– 19 కార్యదర్శి వి.రవికాంత తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులను ఒత్తిళ్లకు గురిచేయడం తగదు

వైఎస్సార్‌సీపీ సెంట్రల్ నియోజకవర్గ సమన్వయకర్త మల్లాది విష్ణు

మధురానగర్(విజయవాడసెంట్రల్): ఉపాధ్యాయులను ఇబ్బంది పెట్టడం, ఒత్తిళ్లకు గురిచేసే విధానాలను కూటమి ప్రభుత్వం మానుకోవాలని వైఎస్సార్ సీపీ సెంట్రల్ నియోజకవర్గ సమన్వయకర్త, మాజీ ఎమ్మెల్యే మల్లాది విష్ణు శనివారం ఒక ప్రకటనలో సూచించారు. పెదపరిమి లీడర్ షిప్ ట్రైనింగ్ క్యాంపులో నూజెండ్ల మండల ఉపాధ్యాయుడు పోతురాజు స్పృహ కోల్పోయిన ఘటన బాధాకరమన్నారు. ఆయన త్వరగా కోలుకోవాలని భగవంతుడిని ప్రార్థిస్తున్నట్లు తెలిపారు. ఉపాధ్యాయులపై కూటమి ప్రభుత్వం చేస్తున్న తీవ్రమైన మానసిక ఒత్తిడి మూలంగానే ఈ సంఘటన జరిగిందన్నారు. ఇప్పటికే రకరకాల యాప్‌లు, ఎఫ్ఎల్ఎన్, లీడర్‌షిప్ ట్రైనింగ్‌లు, అపార్ నంబర్ జనరేషన్ తదితర బోధనేతర పనులతో ఉపాధ్యాయులు తీవ్ర ఒత్తిడికి లోనవుతున్నారన్నారు. ఇటువంటి సమయంలో ట్రైనింగ్‌లు వద్దని ఉపాధ్యాయ సంఘాలు తమ గోడును విన్నవించారని, అయినా ఉన్నతాధికారులు నిర్లక్షించడంతోనే పోతురాజు అస్వస్థతకు గురయ్యారని ఆరోపించారు. ప్రభుత్వం తక్షణమే ఈ లీడర్షిప్ ట్రైనింగులను నిలుపుదల చేయాలని మల్లాది విష్ణు డిమాండ్ చేశారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): అలంకార్ సెంటర్ విద్యుత్ సబ్ స్టేషన్, 11కేవీ గాంధీనగర్ ఫీడరు పరిధిలోని విద్యుత్ లైన్ల మరమ్మతులు, నిర్వహణ పనుల కారణంగా ఆదివారం ఉదయం 9.30 గంటల నుంచి 11 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు టౌన్ ఈఈ రవీంద్రబాబు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆంధ్రరత్న రోడ్డు, నాగేశ్వర రావు పంతులు రోడ్డు, నారా వారి వీధి, గల్లా వారి వీధి, హిందీస్ట్రీట్, జ్ఞానో లీవ్ స్ట్రీట్, ఫిల్మ్ చాంబర్ స్ట్రీట్, అన్నపూర్ణ రోడ్డు, జమిందారు స్ట్రీట్, సన్యాసిరాజు స్ట్రీట్, రైల్వేస్టేషన్ రోడ్డు, గాంధీనగర్, సాంబమూర్తి రోడ్డు ప్రాంతాలలో విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు తెలిపారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

ధర్మజ్ఞానాల సమాహారమే పురాణాలు

విజయవాడ కల్చరల్: ధర్మజ్ఞానాల సమాహారమే మన పురాణాలు అని ఆధ్యాత్మికవేత్త సామవేదం షణ్ముఖ శర్మ అన్నారు. రిషిపీఠం విజయవాడ, సనాతన ధర్మవేదిక ఆధ్వర్యంలో తొమ్మిది రోజులపాటు నిర్వహించే ఆధ్యాత్మిక ప్రసంగాలు దుర్గాపురంలోని ఘంటసాల సంగీత కళాశాలలో శనివారం ప్రారంభమయ్యాయి. సామవేదం మాట్లాడుతూ అంతరిక్షం గురించి మొదటిగా ప్రపంచానికి తెలిపింది భారత దేశమేనన్నారు. పురాణం వింటే చైతన్యం కలుగుతుందన్నారు. వేదాలలో చెప్పిన జ్ఞానాన్ని వ్యాసుడు కథల రూపంలో మనకు అందించినట్లు తెలిపారు. మాజీ మేయర్ జంధ్యాలశంకర్,తొండెపు హనుమంతరావుపాల్గొన్నారు. నిర్వాహకులు సామవేదం షణ్ముఖ శర్మను సత్కరించారు. డాక్టర్ కప్పగంతు రామకృష్ణ నిర్వహించారు.

అలరించిన సినీ సంగీత విభావరి

విజయవాడ కల్చరల్: ఆర్ అండ్ బీ స్వరతరంగిణి ఆధ్వర్యంలో గాంధీనగర్‌లోని హనుమంతరాయ గ్రంథాలయంలో శనివారం సినీ సంగీత విభావరి మధురంగా సాగింది. సీనియర్ గాయకుడు శివశర్మ ఆధ్వర్యంలో వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన గాయనీ గాయకులు కే హనుమత్ ప్రసాద్, పీ లక్ష్మీతులసి, ఎ.ప్రత్యూష, వీ శ్రీనివాసరావు, కేవీ రవి, ఎస్ డేనియేల్, సీహెచ్ జ్యోతి మంగవేణి, నవనీత, కే రాజా, జీ మునుస్వామి తదితరులు తెలుగు హిందీ చిత్రగీతాలను ఆలపించారు. స్వరతరంగిణి వ్యవస్థాపకుడు శివ శర్మ, సంస్థ శ్రేయోభిలాషులు టీ మునిశేఖర్‌లు, ఎల్‌వీ సుబ్రహ్మణ్యం, కే డేవిడ్ రాజు, జోషి, జయప్రభ పాల్గొన్నారు.

ఆరోగ్య కార్యక్రమాలను సక్రమంగా నిర్వహించాలి


ప్రోగ్రామ్ అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న డీఎంహెచ్ఓ డాక్టర్ సుహాసిని

లబ్బీపేట(విజయవాడతూర్పు): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న ఆరోగ్య కార్యక్రమాలను వైద్యాధికారులు నిరంతరం పర్యవేక్షిస్తూ సక్రమంగా నిర్వహించాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ మాచర్ల సుహాసిని ఆదేశించారు. ఆరోగ్య కార్యక్రమాల ప్రగతి, లక్ష్యాలు సాధించేందుకు తీసుకోవాల్సిన చర్యలపై నగరంలోని తన కార్యాలయంలో డీఎంహెచ్ఓ శనివారం సమీక్షా సమావేశం నిర్వహించారు. సమావేశంలో డాక్టర్ మాచర్ల సుహాసిని మాట్లాడుతూ.. జాతీయ నాణ్యతా ప్రమాణాలను అనుసరించి తీసుకోవాల్సిన చర్యలపై సమీక్షించారు. మాతా శిశు సంక్షేమ సేవలు, ఎన్‌సీడీ–సీడీ సర్వే ప్రగతి, వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమం అమలు తీరు, లెప్రసీ, టీబీ కార్యక్రమాలు నిర్వహణ వంటి అంశాలను ఆయా విభాగాల వైద్యాధికారులను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో జిల్లా ఎయిడ్స్ అండ్ లెప్రసీ అధికారి డాక్టర్ జె.ఉషారాణి, జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ పీజే అమృత, డెప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ ఇందుమతి, టీడీ అధికారి డాక్టర్ పద్మావతి, జిల్లా మలేరియా అధికారి డాక్టర్ మోతీబాబు, ఆర్‌బీఎస్‌కే అధికారి డాక్టర్ మాధవీనాయుడు, ఎన్‌హెచ్ఎం డీఈఎంఓ డాక్టర్ నవీన్, ఏపిడిమియాలజిస్ట్ డాక్టర్ స్నేహసమీర, గణాంక అధికారి లక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

పోలవరం మట్టిపై తమ్ముళ్ల కన్ను

విజయవాడ: విజయవాడ రూరల్ పరిధిలోని పోలవరం కాలువ గట్టు మట్టిపై తెలుగు తమ్ముళ్ల కన్ను పడింది. అధికారం అడ్డం పెట్టుకుని కాలువ గట్టుపై మట్టిని విక్రయించి సొమ్ము చేసుకునే పనిలో పడ్డారు. తాజాగా ఆదివారం సాయంత్రం తాడేపల్లి వద్ద కాలువ గట్టుపై మట్టిని తోలేస్తూ అధికారులకు అడ్డంగా దొరికిపోయారు. తాడేపల్లి గ్రామానికి చెందిన టీడీపీ నాయకులు ఈ అక్రమానికి పాల్పడినట్లు తెలుస్తోంది. స్వాతిదుర్గా లారీ ట్రాన్స్‌పోర్ట్ పేరుతో ఉన్న లారీలను సాయంత్రం 4.30 గంటలకు కాలువ గట్టు వద్దకు తీసుకొచ్చి మట్టిని జేసీబీలతో లారీలో వేసి ఇతర ప్రాంతాలకు తరలించే పనిలో పడ్డారు. ఈ విషయాన్ని గ్రహించిన కొందరు గ్రామస్తులు వెంటనే పోలవరం డీఈకి సమాచారం ఇచ్చారు. డీఈ ఆదేశాల మేరకు జేఈ కౌశిక్ ఘటనా స్థలానికి చేరుకుని నాలుగు లారీలు, జేసీబీని అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం. అయితే జేఈ కౌశిక్ ఘటనా స్థలానికి చేరుకునే లోపుగానే 50 లారీల మట్టిని తరలించేశారని గ్రామస్తులు చెబుతున్నారు.

అమ్మను అనాథను చేసి.. అమెరికా వెళ్లిన తనయుడు

- ఇంటిని భార్యపేర రాయించుకున్నాడంటున్న తల్లి
- జీవన భృతి ఇచ్చి, ఇల్లు అప్పగించాలని వేడుకోలు


మాట్లాడుతున్న సత్యనాగకుమారి

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): 'నవ మాసాలు మోశాను. కని పెంచి పెద్ద వాడిని చేశాను. విద్యాబుద్ధులు చెప్పించాను. విదేశాలకు పంపి ఉన్నత చదువులు చదివించాను. ప్రయోజకుడుని చేశాను'. కానీ నా తనయుడు నన్ను అనాథను చేశాడంటూ గన్నవరం గ్రామానికి చెందిన గరిమెళ్ల సత్యనాగకుమారి కన్నీరు మున్నీరవుతోంది. శనివారం విజయవాడ ప్రెస్‌క్లబ్‌లో మీడియా ఎదుట నాగ సత్య కుమారి తన గోడు వెళ్లబోసుకుంది. గన్నవరానికి చెందిన గరిమెళ్ళ నాగేశ్వరరావు, సత్యనాగకుమారి దంపతులు. వీరికి వెంకట ఫణీంద్ర కుమారుడు. నాగసత్య కుమారి భర్త నాగేశ్వరరావు రోడ్డు ప్రమాదంలో మరణించాడు. అప్పటికే అప్పులు చేశాడు. తనయుడు వెంకట ఫణీంద్ర మైనర్ కావడంతో అప్పులు తీర్చే బాధ్యతను తనపై వేసుకుంది. కొడుకును లండన్‌లో ఎంఎస్ చదివించింది. వివాహానంతరం అమెరికా వెళ్లిపోయి స్థిరపడ్డాడు. అప్పటి నుంచి తల్లి బాగోగులు పట్టించుకోవడం లేదు. తన ఇంటిని కూడా అప్పుల వాళ్లు రాయించుకుంటారని చెప్పి తన కుమారుడు భార్య పేర రాయించుకున్నాడని నాగసత్యకుమారి వాపోయింది. కోడలు తండ్రి వచ్చి ఇంటికి రంగులు వేయాలని ఖాళీ చేయించి వేరే వాళ్లకు అద్దెకు ఇచ్చాడని, తనకు నిలువ నీడ కూడా లేదని ఆవేదన వ్యక్తంచేసింది. తన జీవనానికి ఖర్చులు ఇవ్వాలని ప్రభుత్వాధికారుల దృష్టికి తీసుకెళ్లగా తన కొడుకు నుంచి వైద్య ఖర్చులకు రూ.6 లక్షలు బ్యాంక్ ఖాతాకు డిపాజిట్ చేయాలని, ఇంటిని విక్రయించవద్దని ఉత్తర్వులు జారీ చేశారని తెలిపింది. అధికారుల ఉత్తర్వులను ఇప్పటి వరకు పట్టించుకోలేదని వాపోయింది. దీనిపై మళ్లీ కార్యాలయాల చుట్టూ తిరిగినా ఏ ఒక్కరూ సరిగా స్పందించడం లేదని ఆవేదన వ్యక్తం చేసింది. అయితే ఇప్పటికీ తన కొడుకు యోగక్షేమాలు పట్టించుకోవడం లేదంది. ప్రభుత్వ పెద్దలు స్పందించి తనకు న్యాయం చేయాలని. జీవన భృతి కల్పించాలని, తన ఇంటిని తనకు ఇప్పించాలని వేడుకుంది.

హక్కుల సాధనకోసం ముందుకు సాగాలి



గాంధీనగర్(విజయవాడసెంట్రల్): భారత రాజ్యాంగం ఎస్సీ, ఎస్టీ, వర్గాలకు కల్పించిన హక్కుల సాధనకు కలిసి ముందుకు సాగాలని ఎస్‌బీఐ ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్ జనరల్ సెక్రటరీ డీఎస్ఎస్ స్వామి అన్నారు. శనివారం సూర్యారావు పేటలోని ఎస్‌బీఐ జోనల్ కార్యాలయంలో ఎస్‌బీఐ ఎస్సీ ఎస్టీ ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్ అమరావతి సర్కిల్ కార్యవర్గ సమావేశం జరిగింది. ఎస్సీ ఎస్టీ బ్యాంకు ఉద్యోగుల ఫెడరేషన్ జనరల్ సెక్రటరీ డీఎస్ఎస్ స్వామి మాట్లాడుతూ వివిధ బ్యాంకుల్లో పనిచేసిన ఎస్సీ ఎస్టీ ఉద్యోగులను ఒక తాటిపైకి తీసుకొచ్చిన అమరావతి ఫెడరేషన్ నేతలను ఆయన అభినందించారు. కార్యదర్శులు మేడికొండ సునీల్, పి.నారయ్య మాట్లాడుతూ ఉద్యోగులందరూ ఐక్యంగా ఉండాలన్నారు. ఉద్యోగులు ప్రజాహిత కార్యక్రమాలు కూడా చేయాలన్నారు. అమరావతి సర్కిల్ సెక్రెటరీ సతీష్ మాట్లాడుతూ ఎస్సీ ఎస్టీ ఉద్యోగుల హక్కులను కాపాడుతూ మరొకవైపు ఎస్‌బీఐ సేవలను ప్రజల వద్దకు తీసుకెళ్తామన్నారు. ప్రభుత్వ పరంగా లభించే అన్ని బ్యాంకు సదుపాయాలను ప్రజలకు చేరవేస్తామన్నారు. నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆవిష్కరించారు.